ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

ఆదివారం 2 మార్చి 2025



'పది' పరీక్షల ఏర్పాట్లపై
అదనపు కలెక్టర్ సమీక్ష

మెదక్ జిల్లాలో 68 కేంద్రాలు..

10,388 మంది విద్యార్థులు

మెదక్ అర్బన్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అధికారులకు సూచించారు. ఈ కలెక్టరేట్‌లో శనివారం ఆయన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ వరకు జరిగే పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 68 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 10,388 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ సామగ్రి అనుమతి లేదన్నారు. విద్యార్థులు గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. నిఘా కోసం మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామని, ప్రతీ సెంటర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్షల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, విద్యుత్ కోతలు లేకుండా చర్యలు చేపట్టాలని సమావేశంలో డీఈవో రాధాకిషన్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రామేశ్వరప్రసాద్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, డీఎస్‌వో రాజిరెడ్డి, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

మంజీరా నదిలో మునిగి ఇద్దరు యువకుల మృతి 7లో



రంగస్థల 'గిరి'రాజు

7

ప్రభుత్వ ఉద్యోగులు చాలామంది సెలవు దొరికితే కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతూ కాలక్షేపం చేస్తుంటారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మాత్రం తనకు ఇష్టమైన నటనతో నాటక కళకు ఊపిరూలుదుతున్నాడు. కొమురవెల్లి మండలం గురువన్నపేట ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న దేవులపల్లి గిరిబాబు ఓవైపు టీచర్‌గా బాధ్యతతో విధులను నిర్వహిస్తూనే రంగస్థలంపై నవరసాలు పలికిస్తున్నాడు. సామాజిక ఇతివృత్తాలతో కూడిన నాటకాలలో నటిస్తూ సమాజాన్ని చైతన్య పరచడంలో తనవంతుగా కృషి చేస్తున్నారు.

- వందకుపై నాటక ప్రదర్శనలిచ్చిన టీచర్
- వెండితెర, బుల్లితెరపై రాణిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయుడు
- ఉత్తమ జ్యూరీ అవార్డుతో గుర్తింపు
- డాక్యుమెంటరీ, షార్ట్‌ఫిల్మ్‌లతో ప్రతిభ

మెదక్ జిల్లాలో
బర్డ్‌ఫ్లూ భయం లేదు

- ఇతర కారణాలతోనే కోళ్ల మృతి
- కోళ్లఫారాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- పశుసంవర్ధకశాఖ ఏడీ జనార్దన్‌రావు

ఫేస్ టూ ఫేస్

నర్సాపూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు బయటపడలేదని, ప్రస్తుతం అక్కడక్కడ కోళ్లు మృతిచెందడానికి ఇతర అనారోగ్యాలే కారణమని నర్సాపూర్ పశు సంవర్ధకశాఖ సబ్ డివిజన్ ఏడీ డాక్టర్ జనార్దన్‌రావు పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను చర్చించారు.



పశుసంవర్ధక శాఖ నర్సాపూర్ ఏడీ జనార్దన్‌రావు

జిల్లాలో అక్కడక్కడ కోళ్లు మృతిచెండానికి కారణాలేమిటి?

మెదక్ జిల్లాలో ఇప్పటివరకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించలేదు. వేసవి వేడితో పాటు కొక్కెర తెగులు వల్ల చనిపోతున్నాయి.

కోళ్లఫారాల వద్ద ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలి?

కోళ్లఫారాల వద్ద పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి. అక్కడ పనిచేసేవారు కూడా శుభ్రంగా ఉండాలి. కోళ్లఫారాల షెడ్డులోకి ఒక్కరే వెళ్లేలా చూసుకోవాలి. వెళ్లే ముందు కాళ్లను కడుక్కోవాలి. కొక్కర తెగులు వ్యాపించకుండా ప్రతీ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో వ్యాక్సినేషన్ వేయించాలి. కోళ్ల షెడ్డు చల్లగా ఉండేలా చూసుకోవాలి. ఇతర ప్రాంతాల నుంచి కుక్కలు, కొంగలు, బాతులు కోళ్లఫారం వైపు రాకుండా చూసుకోవాలి. కోళ్లను రవాణా చేసే వాహనాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి.

చికెన్, గుడ్లు తినడం మంచిదేనా?

చికెన్, గుడ్లు తినడంతో ఎలాంటి ప్రమాదం లేదు. చికెన్‌ను వండేటప్పుడు వంద డిగ్రీల వరకు వేడిలో ఉడికిస్తాం కాబట్టి ఎటువంటి ప్రమాదం ఉండదు. పరిశుభ్రమైన వాతావరణంలో వంట చేసుకోవాలి.



ఏడుపాయల జాతర ముగియడంతో ఇళ్లకు బయలుదేరి భక్తులు

వెళ్లొస్తాం వనదుర్గమ్మ..
వచ్చే ఏడు మళ్లొస్తాం

ముగిసిన ఏడుపాయల జాతర.. వెనుదిరిగిన భక్తులు

కిటకిటలాడిన బస్సులు.. రద్దీ తగ్గిన రహదారులు

పాపన్నపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజులుగా ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రంలో కొనసాగిన జాతర శుక్రవారం అర్ధరాత్రి రథోత్సవంతో ముగిసింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి మూడు రోజులుగా ఏడుపాయలలోనే బస చేసిన భక్తులు శనివారం వెనుదిరిగారు. చల్లగా చూడు తల్లీ దుర్గమ్మా.. వచ్చే ఏడాది మళ్లీ వస్తాం.. అంటూ మొక్కుకుంటూ ఇళ్లకు బయలుదేరారు.

తగ్గిన తాకిడి.. తొలగని ఇక్కట్లు

ఈసారి ఏడుపాయల జాతరకు భక్తుల సంఖ్య తక్కువగానే ఉంది. కుంభమేళా ప్రభావంతో ఏడుపాయలకు వచ్చేవారి సంఖ్య తగ్గిందని ఆలయవర్గాలు పేర్కొన్నాయి. భక్తుల సంఖ్య తక్కువగా ఉన్నా సౌకర్యాల కల్పనలో లోపాలు కనిపించాయి. తాగునీటి కోసం భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివిధ శాఖల శిబిరాల్లోనూ నీటి కోసం సిబ్బంది ఇబ్బందిపడ్డారు. రోజుకు కేవలం 120 లీటర్ల నీరు ఇచ్చి సరిపెట్టు కొమ్మన్నారని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వాపోయారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందక భక్తులు తప్పిపోయిన తమవారిని వెతకడం కష్టంగా మారింది. ఈసారి జాతరలో ముగ్గురు మృత్యువాత పడగా.. పలువురు గాయపడ్డారు. జాతరకు వచ్చి నీట మునిగి గంగాపూర్ గ్రామానికి చెందిన ఒకరు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు మృతిచెందారు. బండ్ల ఊరేగింపులో ఎడ్లు బెదరడంతో ఒకరికి తీవ్రగాయలవగా.. పలువురికి స్వల్పగాయాలయ్యాయి.

హుండీ ఆదాయం రూ.61,50,237

ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించిన జాతరకు హుండీ, వివిధ రూపాల్లో రూ.61,50,237 ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. గోకుల్ షెడ్‌లో శనివారం ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్, జాతర ప్రత్యేకాధికారి కృష్ణ ఆధ్వర్యంలో సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించారు. 16 రోజుల హుండీ ఆదాయం రూ.24,56,277, ప్రత్యేక దర్శనం (రూ.100)ద్వారా రూ.6,02,800, ప్రత్యేక దర్శనం(రూ.20) ద్వారా రూ.2,98,000, లడ్డూ విక్రయం రూ.18,74,580, పులిహోర విక్రయం రూ.7,96,480, ఒడిబియ్యం టికెట్ రూ.53,950, కేశఖండనం టికెట్ రూ.68,150 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.



ఏడుపాయలలో హుండీ లెక్కిస్తున్న మహిళలు

శివార్లలోనే విస్తరణ

అందోలు-జోగిపేట పట్టణంలో ట్రాఫిక్ తలనొప్పి తగ్గేదేలే..!

గతంలో అశాస్త్రీయంగా డివైడర్ల ఏర్పాటు ● ఈసారి విస్తరణలోనూ సరిచేసే ప్రతిపాదన లేదు

జోగిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని జోగిపేట పట్టణంలో రోడ్డు విస్తరణ లేనట్టేనా అంటే.. అవుననే సమాధానం వినిపిస్తోంది. ట్రాఫిక్ తిప్పలు తప్పుతాయనుకున్న పట్టణవాసులకు నిరాశే మిగిలింది. జాతీయ రహదారిని కలుపుతూ సంగుపేట నుంచి అన్నాసాగర్ వరకు రోడ్డు విస్తరణకు రూ. 20 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన పనులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే, ఈ విస్తరణ అటు సంగుపేట నుంచి అందోలు వరకు.. ఇటు జోగిపేట నుంచి అన్నాసాగర్ వరకు మాత్రమే జరుగుతుందని తెలుస్తున్నది. అందోలు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి హౌసింగ్‌బోర్డు కాలనీ మీదుగా జోగిపేటలో సత్యసాయికాలనీ వరకు 3 కిలోమీటర్లమేర రోడ్డు గతంలోనే విస్తరించి డివైడర్ ఏర్పాటు చేశారు. సంగుపేట చౌరస్తా వద్ద అండర్‌పాస్ బ్రిడ్జ్ నుంచి అందోలు రంగనాయక ఆలయం వరకు 2.8 కిలోమీటర్ల మేర రోడ్డును మొదటి దశలో విస్తరించనున్నారు. రెండో దశలో జోగిపేట సత్యసాయి కాలనీ నుంచి అన్నాసాగర్ వరకు మరో 1.7 కి.మీ. మేర వెడల్పు చేయనున్నారు. జంట పట్టణాల శివార్ల వరకే తప్ప పట్టణాల్లో విస్తరణ చేయడం లేదని ఆర్ అండ్‌బీ అధికారులు తెలిపారు. కంట్రాక్టర్‌తో ఒప్పందంలోనూ ఇదే విషయం ఉందని పేర్కొన్నారు.



జోగిపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద ఓవైపు ఇరుకుగా ఉన్న రోడ్డు

గతంలోనూ అశాస్త్రీయంగా..

అందోలు-జోగిపేట మున్సిపల్ పరిధిలో 2013లో రోడ్డును విస్తరించి డివైడర్లు నిర్మించారు. 2016-17లో మరోసారి రోడ్డుకు మరమ్మతులు చేసి డివైడర్లను వెడల్పు చేశారు. తొలిసారి రోడ్డు విస్తరణ, డివైడర్ల ఏర్పాటు అశాస్త్రీయంగా జరిగింది. అందోలు శివార్లలోని ఐబీ గెస్ట్‌హౌజ్ నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు రోడ్డు విస్తరించి డివైడర్లు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ప్రభుత్వ స్థలం ఉన్న వైపు రోడ్డును విస్తరించకుండా ప్రైవేటు ఆస్తులున్న వైపు విస్తరించారు. బాలాజీ హాస్పిటల్ నుంచి పోస్టాఫీసు వరకు కూడా ఓకవైపే విస్తరించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నది. 2017-18లో రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరైనా అప్పటి కౌన్సిల్ బాధ్యుల నిర్లక్ష్యం కారణంగా పనులు జరగలేదు. రోడ్డు పక్కన భవనాలు, దుకాణాలు ఉన్నవారు కౌన్సిల్ సభ్యులపై ఒత్తిడి తీసుకురావడంతో విస్తరణను నిలిపేశారు. దీంతో, జోగిపేట పట్టణంలో తరచుగా ప్రమాదాలు, ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. ఈసారైనా రోడ్డు విస్తరణ అందోలు-జోగిపేట పట్టణాల్లోనూ కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.



హనుమాన్ ఆలయం వద్ద రోడ్డు దుస్థితి

ఇలా చేస్తే మేలు..



- ఆర్డీవో కార్యాలయం నుంచి ఫైర్‌స్టేషన్ వరకు తూర్పు వైపు రోడ్డు విస్తరించి డివైడర్లను పునర్‌నిర్మించాలి.
- బాలాజీ హాస్పిటల్ నుంచి హనుమాన్ చౌరస్తా వరకు పడమర (బస్టాండ్) వైపు రెండు మీటర్ల మేర రోడ్డును విస్తరించాలి.
- హనుమాన్ ఆలయం, పోస్టాఫీసు వద్ద పడమర వైపు రెండు మీటర్లు రోడ్డును విస్తరించి, డివైడర్లను సరిచేయాలి.

ఉప రాష్ట్రపతి పర్యటనకు ఏర్పాట్లు

పర్యవేక్షించిన సంగారెడ్డి కలెక్టర్

కంది, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌కు నేడు ఉప రాష్ట్రపతి జగదీప్‌ధన్‌కర్ విచ్చేయనున్న నేపథ్యంలో అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. ఆయనతో పాటు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఇతర ప్రముఖులు ఐఐటీహెచ్‌కు రానున్నారు. ఏర్పాట్లను సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి సమీక్షించారు. ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తితో కలిసి కంది ఐఐటీలోని హెలిప్యాడ్, సమావేశ స్థలాన్ని పరిశీలించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఉపరాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. ఐఐటీ హైదరాబాద్ ప్రాంతాన్ని నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించామని, ఉపరాష్ట్రపతి వెళ్లే వరకు డ్రోన్ కెమెరాలు, ఎగిరే పరికరాల వాడకంపై నిషేధం విధిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.



ఐఐటీహెచ్ డైరెక్టర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

విద్యుత్ దీపాల వెలుగులో సిద్దిపేట పట్టణంలోని సుఫియా మసీద్



7లో

రంజాన్ వేళలు

ఆదివారం ఇఫ్తార్	6.28
సోమవారం సహర్	5.11

శుభాల మాసం రంజాన్

నో హెల్మెట్.. నో ఎంట్రీ

ఇప్పటికే మెదక్ కలెక్టరేట్‌లో నో హెల్మెట్.. నో ఎంట్రీ విధానం అమలులో ఉండగా.. ఇకపై మున్సిపల్ కార్యాలయానికి వచ్చే వారు సైతం హెల్మెట్ ధరించకపోతే లోపలికి అనుమతించరు. ఈమేరకు మెదక్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అధికారులు ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేస్తారో లేదో చూడాలి.

-మెదక్ మున్సిపాలిటీ (ఆంధ్రజ్యోతి)



కుస్తీమే సవాల్

మహాశివరాత్రి సందర్భంగా కల్హేర్ భద్రప్పస్వామి జాతర మూడోరోజైన శనివారం కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన మల్లయోధులు తలపడ్డారు. విజేతలకు నగదు బహుమతి అందజేశారు.

-కల్హేర్, (ఆంధ్రజ్యోతి)



విద్యార్థి దశ చాలా కీలకం : ఎస్ఐ

చేర్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ వ్యక్తికి విద్యార్థి దశ చాలా కీలకమని కొమురవెల్లి ఎస్ఐ రాజు అన్నారు. కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల జడ్పీఎస్ఎస్‌లో శనివారం సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, మహిళా రక్షణ చట్టాలు, డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి

రాయపోల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం మంతూరు గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు పర్వేజ్ కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యుత్ శాఖ అధికారి చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

క్రైం కార్నర్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేష్‌కుమార్, పోలీసులు

వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ

- ఆమెతో వివాహేతర సంబంధం
- కుమార్తెను పెళ్లి చేసుకుంటానని ప్రతిపాదన
- నీ వ్యవహారం బయటపెడుతానంటూ ఆమె ఆగ్రహం
- కొట్టి.. ఉరి వేసి హత్య.. రోల్‌గోల్డ్ నగలు ఎత్తుకుని పరారీ

సదాశివపేట, మార్చి 1: (ఆంధ్రజ్యోతి): ఆమెతో వివాహేతర సంబంధం నడుపుతున్నాడు. ఇద్దరూ ఏకాంతంగా ఉన్న సమయంలో 'నీ కుమార్తె భర్త చనిపోయాడు కదా.. ఆమెను నేనే పెళ్లి చేసుకుంటా' అని ప్రతిపాదన పెట్టాడు. తనతో సంబంధం నడపడమే కాకుండా తన కుమార్తెపై కూడా కన్నేశాడని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. తెల్లవారిన తర్వాత గ్రామస్థులకు చెప్పి నీ అంతు చూస్తానని హెచ్చరించింది. అదే జరిగితే తన బండారం బయటపడుతుందని భావించిన అతడు ఆమె తలపై బండరాయితో మోది.. చీరతో ఉరి వేసి చంపేశాడు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల కేంద్రంలో గత నెల 27న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తే చంపేశాడని తేల్చారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ(39)కి అదే గ్రామానికి చెందిన చెల్మెడ భాస్కర్ (45)తో రెండేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. ఆమె గత నెల 27న రాత్రి 10 గంటల సమయంలో సదాశివపేట పట్టణానికి వచ్చింది. అప్పటికే మద్యం సేవించి ఉన్న ఆమె అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో కాలినడకన ఇంటికి వెళ్తూ మార్గమధ్యంలో భాస్కర్ కంటపడింది. మాట కలిపిన భాస్కర్ ఆమెను మండల పరిషత్ కార్యాలయం వెనుకకు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరూ కలిసి అర్ధరాత్రి 2 గంటల వరకు ఏకాంతంగా గడిపారు. ఈ సమయంలో భాస్కర్ నీ కుమార్తె భర్త చనిపోయాడు కదా.. ఆమెను నేనే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. అప్పటికే మూడు పెళ్లిళ్లు చేసుకున్న భాస్కర్ తన కుమార్తెపై కన్నేయడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయింది. మనసులో ఇంత నీచభావం పెట్టుకున్నావా అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తెల్లవారిన తర్వాత గ్రామంలో నీ నిజ స్వరూపాన్ని బయటపెట్టి, పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టించి.. నీ అంతు చూస్తానని బెదిరించింది. అదే జరిగితే తన బండారం పడుతుందని భావించిన నిందితుడు ఆమె తలపై బండరాయితో మోదాడు. ఆమె అవరడంతో నోట్లో చీర కొంగు కుక్కాడు. అంతటితో ఆగకుండా మరోసారి రాయితో కొట్టి, ఛాతీపై పిడిగుద్దులు గుద్దాడు. గొంతు నొక్కి చీరతో ఉరి వేశాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న రోల్డ్ గోల్డ్ చైన్, చెవిదుద్దులు, రూ. రెండు వేల నగదు, కాలి పట్టా గొలుసులు తీసుకుని పరారయ్యాడు. ఉదయం మృతదేహాన్ని చూసి స్థానికులు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. అనుమానంతో శనివారం నిందితుడు భాస్కర్‌ను అరెస్ట్ చేయగా, విషయం బయటపడింది. దీంతో నిందితుడిని రిమాండ్‌కు పంపించారు.

మంజీరా నదిలో మునిగి ఇద్దరి మృతి



శ్యాంకుమార్, కృష్ణ (ఫైల్)

కొల్చారం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గా మాత జాతరకు వచ్చిన ఇద్దరు యువకులు మంజీరా నదిలో మునిగి మృతిచెందారు. మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రం పరిధిలో శనివారం సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ ఇందిరానగర్ కాలనీకి చెందిన నిస్నేకర్ కృష్ణ (20), ఆసిఫ్‌నగర్‌కు చెందిన మిల్కీకర్ శ్యాంకుమార్ (21) కుటుంబసభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం ఏడుపాయల జాతరకు వచ్చారు. జాతర ముగియడంతో శనివారం ఇంటికి వెళ్లే క్రమంలో పోతన్‌శెట్‌పల్లి శివారులో మంజీరా నది రెండో బ్రిడ్జి వద్ద నదిలో స్నానానికి దిగారు. లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో గల్లంతయ్యారు. కుటుంబ సభ్యులు కాపాడేందుకు ప్రయత్నించినా అప్పటికే మునిగిపోయారు. పక్కనే జాతర విధుల్లో ఉన్న గజ ఈతగాళ్ల నీటిలో గాలించి మృతదేహాలను బయటకు తీసుకువచ్చారు. మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేక..



వైష్ణవి (ఫైల్)

నర్సాపూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేక ఓ ఇంటర్ విద్యార్థిని ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ శ్రీరాంనగర్‌లో శనివారం జరిగింది. ఎస్సై లింగం కథనం ప్రకారం.. హన్మకొండకు చెందిన కృష్ణకుమార్ నర్సాపూర్ గిరిజన గురుకులంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. భార్య సునీత, పిల్లలతో నర్సాపూర్‌లో ఉంటున్నాడు. వారి పెద్ద కుమార్తె వైష్ణవి(16) హైదరాబాద్ నాగోల్ సమీపంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టంలేక తరచూ ఇంటికి వచ్చేది. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ఆమెకు నచ్చజెప్పి.. హాస్టల్‌కు పంపించేవారు. ఇలాగే, నెల క్రితం ఇంటికి వచ్చింది. ఈ నెల 5 నుంచి పరీక్షలు ఉండటంతో ఆదివారం తిరిగి కళాశాలకు తీసుకెళ్లాలను తల్లిదండ్రులు నిర్ణయించారు. హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేని వైష్ణవి శనివారం సాయంత్రం చదువుకుంటానని చెప్పి, గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. గదిలో నుంచి శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే కిందికి దించి నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి..

గజ్వేల్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ పట్టణానికి చెందిన చిగుళ్లపల్లి యాదగిరి కిరాణం, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంతకాలంగా రియల్ వ్యాపారం తగ్గి అప్పులపాలయ్యాడు. వీటిని ఎలా తీర్చాల్లో తెలియక శనివారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భార్యతో గొడవ పడి యువకుడు..



కంటి నాని(ఫైల్)

జోగిపేట, మార్చి1 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవ పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అందోల్ పట్టణంలోచోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. అందోల్ పట్టణంలోని 6వ వార్డుకు చెందిన కంటి నాని (26) శుక్రవారం రాత్రి భార్యతో గొడవ పడ్డాడు. అదే రాత్రి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న మృతుని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..

గజ్వేల్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన గజ్వేల్‌లోని ఢిల్లీవాలా హోటల్ వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మద్దూరు మండలం సలక్‌పూర్ గ్రామానికి చెందిన తరిగొప్పుల లచ్చవ్వ గజ్వేల్‌లోని తన మనవడైన తరిగొప్పుల మహేష్ ఇంట్లో ఉంటుంది. వ్యక్తిగత పని నిమిత్తం గజ్వేల్ పట్టణంలోని ఉమామహేశ్వర కిరాణం నుంచి వెళ్తుండగా పట్టణంలోని ఢిల్లీ వాలా హోటల్ వద్ద గజ్వేల్ పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌కు చెందిన బస్సు ఢీకొట్టగా ఆమె బస్సు చక్రాల కింద పడి మృతి చెందింది. బస్సు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

శుభాల మాసం రంజాన్

- నేటి నుంచి ఉపవాస దీక్షలు
- వెల్లివిరియనున్న ఆధ్యాత్మిక శోభ
- మసీదులు ముస్తాబు



సిద్దిపేటలో హలీం అమ్మకాలు



పండ్లు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మెదక్ కల్చరల్/సిద్దిపేట కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అన్ని మాసాల్లోకెల్లా గొప్పది రంజాన్ మాసమని ముస్లింల నమ్మకం. ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ ఈ నెలలోనే భూమిపై ఆవిర్భవించిన మాసంగా చెబుతారు. అంతటి శుభాల మాసం వచ్చేసింది. శనివారం నెలవంక కనిపించడంతో రాత్రి ప్రత్యేక ప్రార్థన(దువా) ద్వారా, తరవీ నమాజ్‌తో రంజాన్ సందడి ప్రారంభమైంది. ఆదివారం సహర్‌తో రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం అవుతాయి. 30 రోజుల పాటు ముస్లింలు నిష్ఠగా ఉపవాస దీక్షలు పాటిస్తారు. ప్రత్యేక తరావీ నమాజ్‌లు చదువుతారు.

విద్యుత్ దీపాలతో ముస్తాబు

ఉపవాస దీక్షలు పాటించే ముస్లింలు తప్పనిసరిగా ఐదు పూటలా నమాజ్ చేస్తారు. ప్రత్యేక తరావీ నమాజ్ కూడా ఉంటుంది. రంజాన్ ప్రార్థనల కోసం ఉమ్మడి జిల్లాలోని మసీదు ముస్తాబయ్యాయి. ఆయా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వెలిసిన హలీం స్టాళ్లు

రంజాన్ మాసం కోసం హోటళ్లలో హలీం తయారు చేస్తున్నారు. హోటళ్లతో పాటు ప్రత్యేక స్టాళ్ల ఏర్పాటు చేశారు. ముస్లింలే కాకుండా అన్ని వర్గాల వారు హలీం రుచి చేసేందుకు ఇష్టపడుతుండటంతో ఉమ్మడి జిల్లా కేంద్రాలతో పాటు పట్టణాల్లోనూ హలీం దుకాణాలు వెలిశాయి. ఇఫ్తార్ కోసం పండ్ల దుకాణాలూ ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మిక చింతనతో ఉండండి



పవిత్రమైన రంజాన్ మాసం మొత్తం ఆధ్యాత్మిక చింతనతో గడపాలి. దాన ధర్మాలకు రంజాన్ మాసం చక్కటి అవకాశం. వీలైనంతగా అల్లాహ్‌ను స్మరించండి. నమాజులు, జకాత్ ఇవ్వండి. నెల రోజుల పాటు రోజా పాటించండి.

- ముఫ్తీ కరీముద్దీన్ పటేల్, ఇమామ్ ఫిర్దౌస్ మసీద్, సిద్దిపేట

పేదలకు చేయూతనిద్దాం



రంజాన్ ముస్లింలకు పవిత్రమైన మాసం. ఖురాన్ అవతరించిన మాసం కూడా ఇదే. రంజాన్ సందర్భంగా, ముస్లింలు ఉపవాసం ఉండటమనేది ఇస్లాం ఐదు ప్రాథమిక స్తంభాలలో ఒకటి. ఈ మాసమంతా సేవా దృక్పధంతో ఉండాలి. నిత్యం అల్లా పేరును జపిస్తూ భక్తితో ఉపవాసం కొనసాగించండి. ఆర్థికంగా అవసరమైన పేదవారికి చేయూతనందించి అల్లా ఆశీస్సులు పొందండి.

- ముఫ్తీ ఉబేదుర్ రహమాన్, ఇమామ్, సుఫియా మసీద్, సిద్దిపేట

ఆస్పత్రిలో బాలింత మృతి

కుటుంబ సభ్యుల ఆందోళన- ఆస్పత్రి అద్దాలు.. ఫర్నిచర్ ధ్వంసం, సిబ్బందిపై దాడి



ఆందోళన చేస్తున్న బంధువులు(ఇన్‌సెట్‌లో మానంది ఫైల్)

సంగారెడ్డి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రక్త స్రావం అవుతుందని చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన బాలింత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శనివారం జరిగింది. ఆస్పత్రి వర్గాలు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోహీర్ మండలం మాద్రి గ్రామానికి చెందిన మానంది(24) రెండో కాన్పు కోసం జహీరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా సిజేరియన్ కాన్పు ద్వారా ఆడబిడ్డ జన్మించింది. ఈ క్రమంలో బాలింతకు తీవ్రరక్తస్రావం జరుగుతుండడంతో అక్కడి వైద్యులు శుక్రవారం అర్ధరాత్రి హుటాహుటిన సంగారెడ్డికి రెఫర్ చేశారు. ఆస్పత్రిలో చేరిన బాలింతకు తీవ్ర రక్త స్రావం అవుతుండడాన్ని గుర్తించిన డాక్టర్లు సర్జరీ చేసి గర్భసంచిని తొలగించారు. తెల్లవారుజామున బాలింతకు స్ట్రోక్ రావడంతో సీపీఆర్ చేసినా ఫలితం లేకపోవడంతో మృతి చెందిందని డాక్టర్లు నిర్ధారించారు.

కుటుంబ సభ్యుల ఆగ్రహం

డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే బాలింత చనిపోయిందంటూ కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. యాజమాన్యాపై వాగ్వాదానికి దిగారు. ఉదయం మృతి చెందితే సాయంత్రం వరకు కూడా స్పందించకపోవడంతో ఆగ్రహంతో కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి అద్దాలు, ఫర్నిచర్, పూలకుండీలు, కంప్యూటర్లు ధ్వంసం చేశారు. సిబ్బందిపై దాడి చేశారు. ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నది. పలువురు పోలీసులు ఉన్నా వారిని కట్టడి చేసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. బాలింత కుటుంబసభ్యులు సంగారెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాలింత డెడ్‌బాడీని సంగారెడ్డి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. బాలింత మృతిపై డాక్టర్ల నిర్లక్ష్యం ఏ మాత్రం లేదని ఆస్పత్రి ఎం.డి. లాలేష్ తెలిపారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, తదితరులు

ఆదివాసీల హక్కుల కోసం పోరాడుదాం

పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఆదివాసీల హక్కుల కోసం ఐకమత్యంగా పోరాడుదామని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. దేశంలో ఆదివాసులపై జరుగుతున్న హత్యాకాండను నిరసిస్తూ సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాగుల భూపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనులు, ఆదివాసీలపై కక్ష కట్టి, రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాలరాస్తూ వారిని ఎన్‌కౌంటర్ల పేరుతో హత్య చేస్తోందని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లోని అటవీ, భూగర్భ వనరులను దోచుకుని, కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ఆపరేషన్ కంగార్ పేరుతో ఊచకోత కోస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీల హక్కుల గురించి మాట్లాడే వారిని అర్బన్ నక్సలైట్లుగా ప్రచారం చేస్తుందని, ఇది మోదీ, అమిత్‌షా ప్రచారమన్నారు. ఈ సందర్భగా సిద్దిపేట జిల్లా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కమిటీని ప్రకటించారు. జిల్లా కో-ఆర్డినేటర్‌గా రాగుల భూపతి, జిల్లా కన్వీనర్లుగా సత్తయ్య, శ్రీకాంత్, బాబురావ్, మల్లారెడ్డి, దుర్గ రాములు, కేసరి ఎల్లం, కృష్ణ, నర్సింలు, ఆనంద్, భూపతి, జగన్‌లను నియమించారు.

మహదేవుడిని దర్శించుకున్న ఎంపీ



పటాన్‌చెరు మహదేవుడి ఆలయం వద్ద ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పట్టణంలోని పురాతనమైన మహదేవుడి ఆలయాన్ని ఎంపీ రఘునందన్‌రావు శనివారం సందర్శించారు. శివస్వాముల దీక్షా ఇరుముడి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 8వందల చరిత్ర ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమం అనంతరం ఎంపీకి ఆశీర్వచనాలు అందజేశారు. ఎంతో మహిమాన్వితమైన మహదేవుడి ఆలయానికి ఈ ప్రాంతంలో విశిష్టస్థానం ఉందన్నారు. యువత చేపడుతున్న శివదీక్ష ఎంతో ప్రభావవంతమైందన్నారు. ఎంపీతో పాటు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కొల్కూరి రాజశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, అమీన్‌పూర్ మండల పార్టీ అధ్యక్షుడు ఈర్లరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా బీరంగూడా భ్రమరాంబ మల్లికార్జునస్వామి హుండీ లెక్కింపు పూర్తి చేశారు. శనివారం నిర్వహించిన హుండీ లెక్కింపు అనంతరం వివిధ ఆదాయ మార్గాల ద్వారా ఈ సంవత్సరం మొత్తం రూ.47,99,283 ఆదాయం సమకూరిందని ఆలయ చైర్మన్ సుధాకర్‌యాదవ్, ఈవో శశిధర్ గుప్తా, ప్రత్యేక అధికారి అన్నపూర్ణ, జూనియర్ అసిస్టెంట్ మల్లిఖార్జున్‌రెడ్డిలు పేర్కొన్నారు. హుండీ ద్వారా రూ.6,18,694, టికెట్ల విక్రయం ద్వారా రూ.20,50,000, దుకాణాల టెండర్ల ద్వారా రూ.20,82,116 ఆదాయం వచ్చిందన్నారు.



కేసీఆర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

సుదర్శన చక్ర శిఖర ప్రతిష్ఠకు కేసీఆర్‌కు ఆహ్వానం

మర్కుక్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో సుదర్శనచక్ర శికర ప్రతిష్ఠకు హాజరు కావాలని మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో శిఖర ప్రతిష్ఠ మహోత్సవం జరగనుందని మండల మాజీ ఎంపీపీ పాండు గౌడ్, నాచారం గుట్ట మాజీ చైర్మెన్ హరిపంతులు తెలిపారు. ఈ మేరకు వారు ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

రంగస్థల 'గిరి'రాజు

వందకుపైగా నాటక ప్రదర్శనలిచ్చిన టీచర్

- వెండితెర, బుల్లితెరలపై రాణిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయుడు
- ఉత్తమ జ్యూరీ అవార్డుతో గుర్తింపు
- డాక్యుమెంటరీ, షార్ట్‌ఫిల్మ్‌లతో ప్రతిభ



ప్రత్యేక పాత్రలో గిరిబాబు..



నాటక ప్రదర్శనలో గిరిబాబు



ఏపీలో చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న గిరిబాబు(ఫైల్)

నంగునూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాఠాలు చెప్పడమే కాదు.. రంగస్థలంపై రాణిస్తూ తనకంటూ ప్రత్యేకత చాటుకుంటున్నారు దేవులపల్లి గిరిబాబు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామానికి చెందిన గిరిబాబు చిన్నప్పుడు ఊరిలో ప్రదర్శించే వీధి భాగవతాలు చూస్తూ నటన పట్ల ఆకర్షితుడయ్యాడు. సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పట్టభద్రుడు కాగా, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ(జాగ్రఫీ), బీఈడీ పూర్తి చేశారు. బీఈడీ పూర్తి చేశాక నటన మీద ఆసక్తితో హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో థియేటర్ ఆర్ట్స్ కోర్సులో పీజీ చదివారు. నాటకాల్లో నటిస్తూనే డీఎస్సీకి ప్రిపేరై ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు.

వందకుపైగా నాటక ప్రదర్శనలు

ప్రభుత్వ ఉద్యోగం సాధించినా.. నటనపై మక్కువ పోలేదు. విధిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే సెలవు రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలలో ప్రభుత్వం నిర్వహించే నంది నాటకోత్సవాలు, సినీ రచయిత బుర్ర సాయిమాధవ్ నిర్వహించే తెనాలి కళల కాణాచి నాటక పరిషత్, ఎన్టీఆర్ నాటక పరిషత్, పరుచూరి రఘుబాబు నాటక పరిషత్, తెలంగాణ యువ నాటకోత్సవం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖకు చెందిన 'తెర', గోవాడ క్రియేషన్స్‌తోపాటు వివిధ నాటక పరిషత్తులు నిర్వహించే నాటక ప్రదర్శనలలో పాల్గొన్నారు. రాజగృహప్రవేశం (అంబేడ్కర్ జీవితచరిత్ర), యజ్ఞం (తెలంగాణ ఉద్యమ నేపథ్యం), ఆకాశ దేవర(దొంగ బాబాల నేపథ్యం), రచ్చబండ(తెలంగాణ గ్రామీణ జీవనం), ఇంటర్వ్యూ (తెలంగాణ సాగునీటి రంగ నిపుణు లు విద్యాసాగర్‌రావు జీవిత చరిత్ర), గాలి బతుకులు(వంశరాజు కులస్థుల చరిత్ర), బంగారు బిడ్డ(బట్టీ చదువుల నేపథ్యం), షాడో లెస్ మాన్ (మనిషి ప్రవర్తన), సావిత్రిబాయి పూలే (మొదటి మహిళా ఉపాధ్యాయురాలు) వంటి 25పైగా నాటకాలను వందకుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. సుమారు 20 రేడియో నాటికల్లో ఆర్టిస్టుగా నటించి మెప్పించారు.

చీకటి పువ్వు నాటికతో మంచి గుర్తింపు

గతేడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నంది నాటకోత్సవాలలో కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి వారు ప్రదర్శించిన 'చీకటి పువ్వు' నాటికలో దేవులపల్లి గిరిబాబు ముఖ్యపాత్రలో నటించారు. ఈ నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపిక అయింది. ఈ నాటికలో సిద్ధు అనే పాత్రలో నటించి అలరించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో చీకటి పువ్వు నాటిక ప్రదర్శన తర్వాత అప్పటి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహాదారు రమణాచారి నుంచి సన్మానం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ నాటక పరిషత్తులు నిర్వహించిన నాటక పోటీలలో 15 ఉత్తమ జ్యూరీ అవార్డులను అందుకున్నారు. గత నెలలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పోటీలలో రెండుసార్లు ఉత్తమ సహాయ నటుడు అవార్డును అనుకున్నారు. పోలుదాసు శ్రీనివాసరావు దర్శకత్వంలో ప్రదర్శించిన 'నిశి' నాటికలో 'ఆకాశ్' అనే పాత్రకు రెండుసార్లు ఉత్తమ జ్యూరీ అవార్డును అందుకున్నారు.

బుల్లితెర, వెండితెరపై రాణిస్తూ..

రంగస్థలంపై ప్రతిభను కనబరిచిన గిరిబాబు బుల్లితెర, వెండితెరపై సామాజిక చైతన్యం కలిగిన పాత్రల్లో నటిస్తున్నారు. వన్డే షార్ట్ ఫిలిం, ఒక తెలుగు ప్రేమ కథ, జ్యామెట్రీ బాక్స్, సీతా బాలకృష్ణ చిత్రాలలో నటించారు. సీతా బాలకృష్ణ చిత్రం ఓటీటీలో విడుదలైంది. బుల్లి తెరపై గీతా గోవిందం, గృహలక్ష్మి సీరియల్స్‌లో నటించారు. ఇబ్రహీంనగర్ అనే గ్రామంపై నిర్మించిన డాక్యుమెంటరీలో, తాతా మనవరాలు అనే షార్ట్ ఫిల్మ్‌లో తన నటనతో ప్రతిభను చాటా రు. సామాజిక అంశాలపై వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాలలో అప్లోడ్ చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారం గ్రామ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నపుడు గత సాధారణ ఎన్నికలకు ముందు ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎస్సీఈఆర్టీ) సంచాలకుడు గాజర్ల రమేశ్ రచించిన 'ఓడిపోనీయకు మీ ఓటును' అనే పాట అక్కడి విద్యార్థులతో కలిసి నృత్య ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.

పేద విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తా..



పేద విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక బాధ్యతను నేర్పిస్తూ వారి ఉన్నతికి పాటు పడుతున్నా. భవిష్యత్తులో పేద విద్యార్థుల అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తా. వారి అభ్యున్నతికి కృషి చేయడం ఉపాధ్యాయుడిగా నాకు దొరికిన అదృష్టంగా భావిస్తున్నాను.

- దేవులపల్లి గిరిబాబు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ఆటపాటలతో పాఠాలు..

దేవులపల్లి గిరిబాబు పాఠాలను ఆట, పాటల ద్వారా బోధిస్తూ ఆకట్టుకుంటున్నాడు. తరగతి గదిలో వినూత్న రీతిలో పాఠాలు బోధిస్తూ 2024లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. పాఠశాల విద్యార్థుల హాజరుశాతం పెంచడం కోసం శత శాతం హాజరైన విద్యార్థులకు, ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, నోటు బుక్‌లను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

కంకర వేశారు.. తారు మరిచారు..!

- మోక్షం కలుగని అంతర్ జిల్లా రోడ్డు
- గుంతల్లో పడిపోతున్న వాహనాలు
- నెలక్రితం నిరసన దీక్షలు, అయినా తీరని సమస్య


కంకరతో నిజాంపేట-నస్కల్ రోడ్డు దుస్థితి

నిజాంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అది మెదక్-కామారెడ్డి జిల్లా సరిహద్దు రహదారి. దాని మీదుగా ప్రతినిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అలాంటి రోడ్డు తవ్వి కంకర వేసి.. తారు మరిచారు. దీంతో నిజాంపేట-నస్కల్ రోడ్డు దశాబ్దంగా నరకప్రాయమైంది. పైకి లేచిన గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఎందరో పడిపోయి కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నారు. దరిమిలా అప్పటి ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పంజా విజయ్ వేర్వేరుగా పలుమార్లు పాదయాత్రలు ధర్నాలు చేపట్టారు. దీంతో రెండేళ్ల క్రితం బీటీ రోడ్డు కోసం రూ.12 కోట్లు మంజూరయ్యాయి. సదరు కాంట్రాక్టర్ రోడ్డు తవ్వి కేవలం కంకర పరిచి వదిలేశాడు. ఇది జరిగి ఏడాదిన్నర ఖరుస్తున్నా.. ఇప్పటికీ తారు వేయక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నెలక్రితం ఆయా గ్రామాల ప్రజలు నిరసన దీక్షలు చేపట్టారు. విషయం తెలుసుకున్న జిల్లా ఆర్ అండ్ బీ అధికారి సర్వేశ్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు పత్తిరాజులు రహదారి పనులు జరిగేలా చూస్తారని హామీ ఇచ్చినా ఫలితం లేకపోయింది. దీంతో ప్రస్తుతం మళ్లీ దీక్షలు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు నిర్ణయించుకున్నారు.

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా..?

నస్కల్ వెళ్లే రహదారి ఏళ్లకాలంగా అస్తవ్యస్తంగా మారింది. కంకర రోడ్డుతో వాహనాలు పడిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి, ఇప్పటివరకు ఎందరో గుంతల్లో పడి కాళ్లు చేతులు విరగ్గొట్టుకున్నా ప్రారంభించరా. ప్రాణాలు పోవాలా.. ఇప్పటికైనా పనులు ప్రారంభించకపోతే ఆందోళనలు, రాస్తారోకోలు తప్పవు.


- ఎండీ.అబ్దుల్, నస్కల్ గ్రామస్థుడు

న్యూస్ బాక్స్

ముత్తాయికోటలో శివపార్వతుల కల్యాణం

హవేళీఘనపూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): హవేళీఘనపూర్ మండలం ముత్తాయికోట గ్రామంలోని సిద్ధేశ్వర ఆలయంలో పూజారి గోవింద్‌మహరాజ్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం శనివారం నిర్వహించారు. స్వామివారిని ఎదుర్కోలు నిర్వహించి వేదమంత్రాల మంగళవాద్యాల మధ్య కల్యాణం కొనసాగింది. మెదక్ పట్టణంతో పాటు సమీప గ్రామాల భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి: ఏఐఎస్ఎఫ్

నారాయణఖేడ్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5 నుంచి 24 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి సంబంధిత అధికారులు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తురెడ్డి కోరారు. శనివారం ఖేడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

జాతర ఏర్పాట్లు పూర్తి

జిన్నారం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9 నుంచి కట్టమైసమ్మ, 10, 11న ఎల్లమ్మ ఆలయాల జాతర నిర్వహించనున్నామని, ఇందుకు తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు మద్దూరి పెంటేష్, లక్ష్మణ్‌రావు, దేవయ్య, నారాయణ కుమార్, నాగరాజు, శ్రీరాములు, సత్యనారాయణ, శ్రీనివాస్ తెలిపారు.

పాఠిబండ్ల ప్రదర్శన

నారాయణఖేడ్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాద్వార్‌లో దుర్గాభవానీమాత జాతరను పురస్కరించుకుని శనివారం పాఠిబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానంతో పాటు మానిక్యాలదేవి చరిత్ర నాటక ప్రదర్శన కూడా చేశారు. ఈ ఉత్సవాలు పురస్కరించుకుని 2న ఉదయం 11 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు.

ఘనంగా స్వయంపాలన

మునిపల్లి/శివ్వంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంతారం జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సయ్యద్ సాబెర్‌అలీ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, గీతామణి, వెంకటలక్ష్మి, రామకృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శివ్వంపేట మండల పరిధిలోని పాంబండ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఆనందంగా జరుపుకున్నారు. డీఈవోగా వినయ్, ఎంఈవోగా అభిలాష్, హెచ్ఎంగా అరవింద్, పీఈటీగా వరుణ్, ఉపాధ్యాయులుగా భూపాల్ రామచంద్రన్, తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు.

పీఏసీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ ప్యాకల్టీ మెంబర్ డాక్టర్ పికాస్వామి అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలో సొసైటీ పరిధిలోని ఉత్నూరు గ్రామంలో రైతులకు పీఏసీఎస్ ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంజీవరెడ్డి, డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, సీఈవో రమేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేదల గొంతుకగా నిలిచిన ఎంఐఎం

జహీరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పేదల గొంతుకగా ఎంఐఎం నిలబడుతుందని ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి అత్తర్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలో ఎంఐఎం పార్టీ 67 ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఆర్‌ఆండ్‌బీ గెస్ట్‌హౌజ్ వద్ద ఎంఐఎం జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు మోహియోద్దీన్‌గోరి పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే

పటాన్‌చెరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసం పురస్కరించుకుని జీఎంఆర్ యువసేన నాయకుడు షకీల్ రూపొందించిన క్యాలెండర్‌ను పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. ఉపవాస దీక్షలు ప్రారంభం కావడంతో పండుగ వాతావరణం నెలకొన్నదన్నారు. సొంత నిధులతో నియోజకవర్గంలోని ఈద్గాలు, దర్గాలు, మసీదులను అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మైనార్టీ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


రంజాన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఆగని నిరసనలు


దీక్షలో జేఏసీ నాయకులు, వడ్డెర కుల సంఘం సభ్యులు

గుమ్మడిదల/నర్సాపూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు 25వ రోజుకు చేరుకున్నాయి. శనివారం గుమ్మడిదల మండల కేంద్రంతో పాటు నల్లవల్లి గ్రామంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. గుమ్మడిదల దీక్షలో వడ్డెర సంఘం కులస్థులు పాల్గొని జేఏసీకి రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నల్లవల్లి సమీపంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డు వల్ల నర్సాపూర్ ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆలింపక్ష ఆధ్వర్యంలో చేపటిన రిలే దీక్షలు 13వ రోజుకు చేరాయి. శనివారం దీక్షలో మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, మాజీ ఎంపీపీ రమణ, మాజీ కౌన్సిలర్లు రాజేందర్, సురేష్, యాదగిరి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను ప్రేరేపించి రాజకీయ లబ్ధి

- జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బాలయ్య

సంగారెడ్డి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలను ప్రజల్లో ప్రేరేపించి రాజకీయ పార్టీలు లబ్ధిపొందుతున్నాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గైని బాలయ్య అన్నారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్), కొండాపూర్ మండలం మల్కాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పట్టణంలోని కరుణ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలు, అశాస్త్రీయ భావాలు ప్రజల్లో నాటి రాజకీయ నాయకులు వారి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. అనంతరం శరీరంపై మంటతో రుద్దుకోవడం, విద్యార్థులపై మట్టితో మంటలు మండించడం, నీళ్లలో మంటలు పుట్టించడం, మొకాళ్లలో మొలలు తీయడం, గాజు పెంకులపై విద్యార్థులను నడిపించి మూఢ నమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విద్యాసాగర్, జేవివి జిల్లా గౌరవ అధ్యక్షుడు సోమశేఖర్, జిల్లా కోశాధికారి ప్రశాంత్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


పోతిరెడ్డిపల్లిలోని జడ్పీహెచ్ఎస్‌లో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న బాలయ్య

ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కటి.. బోర్లు 20..!

- తరచూ కాలిపోతున్న మోటార్లు
- ఎండుతున్న పంటలు

హత్నూర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండలం పరిధిలోని కాసాల గ్రామ శివారులో వ్యవసాయ పొలాల వద్ద ఒక్కటే ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో 20 మోటార్లు నడుస్తుండడంతో తరచూ కాలిపోతుండడంతో రైతులు బోరు మంటున్నారు. యాసంగిలో అప్పులుచేసి వరి వేస్తే నీరు సరిపోక పంటలు ఎండుముఖం పడుతున్నాయి. అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు మొరపెట్టుకున్నా.. లెక్క చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రైతులు అన్ని బోర్లు ఒకేసారి కాకుండా షిఫ్టు వారీగా నడిపించుకోవాలని విద్యుత్ అధికారులు ఉచిత సలహా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నట్లు రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పంటలు ఎండకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.


ఎండిపోతున్న వరి

గ్రామస్థులపై మట్టి మాఫియా దాడి

కోహీర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మట్టి తవ్వకాలను అడ్డుకున్నందుకు గ్రామస్థులపై దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి సంగారెడ్డి జిల్లా మద్రి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పలువురిపై అక్రమ మట్టి రవాణా చేస్తున్న మాఫియా దాడి చేశారు. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మద్రి గ్రామ శివారులో వక్ఫ్ పరిధిలో ఉన్న భూమిలో సారవంతమైన మట్టిని కొన్ని రోజులుగా అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. దీనిపై ఇటీవల గ్రామస్థులు రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామానికి చెందిన వసీం, అజీమ్, మజీద్, ఫక్రొద్దీన్, జాకీర్, సిరాజ్ మట్టి రవాణాను ఆపేందుకు శుక్రవారం రాత్రి మట్టి తవ్వకాలు చేపడుతున్న ప్రాంతానికి వెళ్లారు. మట్టి తవ్వకాలు చేపడుతున్న కొందరు వీరిపై కర్రలతో దాడి చేశారు. దాడిలో వసీం తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగిలినవారికి స్వల్ప గాయాలయ్యాయి. దాడిలో గాయపడిన వారు శనివారం కోహీర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


దాడిలో గాయపడిన వసీం, అజీమ్

భావితరాలకు విజ్ఞానశాస్త్రం దోహదం


ఎగ్జిబిట్ల గురించి తెలుపుతున్న విద్యార్థులు

జహీరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు విజ్ఞానశాస్త్రం ఎంతగానో దోహదపడుతుందని రావూస్ పాఠశాల సీఈవో నిరిన్‌రావు, సమన్వయ కర్త విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ విజయ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని రావూస్ పాఠశాలలో సైన్స్‌ఫేర్ నిర్వహించారు.

జిల్లాల్లో విద్యుత్‌కు ఇబ్బందులు లేవు: సీఈ

చేగుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు సమస్య పరిష్కారానికి కృషిచేయాలని, లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని తెలంగాణ పది జిల్లాల విద్యుత్‌శాఖ రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి పేర్కొన్నారు. శనివారం చేగుంట మండల పరిధిలోని కర్నాల్‌పల్లి విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. గత సంవత్సరం కంటే పదిశాతం విద్యుత్ వినియోగం పెరిగిందని, అయినా విద్యుత్ సరఫరాలో ఇబ్బంది లేదని చెప్పారు. వేసవికాలంలో విద్యుత్ సమస్య రాకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెదక్ జిల్లాకు 13 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను పెట్టిందని, ఇప్పటివరకు అవసరమున్నచోట ఏడు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. వారి వెంట తూప్రాన్ డీఈ గరత్ మంత్‌రాజ్, ఏఈ భరత్ ఉన్నారు.

వైభవంగా సంగమేశ్వరుడి రథోత్సవం

ఝరాసంగం/పెద్దశంకరంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారి విమాన రథోత్సవాన్ని నిర్వహించారు. రథాన్ని వివిధ రంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. పార్వతీ పరమేశ్వర ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ప్రతిష్ఠించి బసవన్న మందిరం వరకు డప్పుచప్పుళ్లు, బాణసంచా పేల్చుతూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంతురావు పాటిల్, ఆలయ ఈవో శివరుద్రప్ప పాల్గొన్నారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని కోప్పోల్ ఉమాసంగమేశ్వరస్వామి ఆలయంలో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. శుక్రవారం రాత్రి ఆలయంలో ఉమాసంగమేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి రథంపై ఊరేగించారు.

ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆనంద్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆనంద్‌కుమార్ నియమితులయ్యారు. ఇదివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రాజేశ్వర్‌రావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో అదే కళాశాలలో సీనియర్ ట్రైనింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆనంద్‌కుమార్‌కు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగించగా, శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

మాదిగ అమరుల త్యాగాలు మరువలేనివి

జహీరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన అమరులత్యాగాలను మరువలేమని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అక్షరం మాదిగ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ గెస్ట్‌హౌజ్ వద్ద అమరుల చిత్రపటాలకు చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.

●కంగ్టి: మండల కేంద్రమైన కంగ్టిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో, స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాదిగ అమరుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.

●కోహీర్: కోహీర్ మండలంలోని దిగ్వాల్ మఠం చౌరస్తా వద్ద డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవికిరణ్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు.

●చేగుంట: చేగుంటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొలుపుల రామస్వామి ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు.

●హవేళీఘనపూర్: హవేళీఘనపూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు బాలరాజ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.


శివ్వంపేటలో కొవ్వొత్తుల ప్రదర్శన

●మనోహరాబాద్: మనోహరాబాద్ మండలంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మురళి ఆధ్వర్యంలో అమరులకు నివాళులర్పించారు.

●శివ్వంపేట: మండల కేంద్రమైన శివ్వంపేటలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో శనివారం దళిత నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

●మెదక్ కల్చరల్: జిల్లా కేంద్రమైన మెదక్ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుడు ఉస్తార్లపల్లి బాలరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లిశెట్టి రవి మాట్లాడారు.

టీపీసీసీ ఇన్‌చార్జిని కలిసి నీలం మధు

పటాన్‌చెరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన మీనాక్షి నటరాజన్‌ను కాంగ్రెస్ నాయకులు నీలం మధు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన మీనాక్షి నటరాజన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నిబద్ధత, నిరాడంబరత ఉన్న నాయకురాలు మీనాక్షి నటరాజన్ నేతృత్వంలో రాష్ట్రంలో పార్టీ మరింత బలపడుతుందన్నారు.


పీసీసీ ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్‌ను కలిసిన నీలంమధుముదిరాజ్

'సెయింట్ పీటర్స్'లో సుస్థిర అభివృద్ధిపై అవగాహన

సంగారెడ్డి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్రకృతిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను బుర్రకథ ద్వారా ప్రదర్శించారు. విద్యార్థులంతా ఒక్కొక్క లక్ష్యం గురించి ప్రాజెక్టులు చేసిన ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల చైర్మన్ ఈ.అంతిరెడ్డి, ఈ అబ్బాస్ అకాడమీ వ్యవస్థాపకులు డా.పరిపవన్, పీడ్ అకాడమీ సభ్యులు దినేష్‌రెడ్డి, కరస్పాండెంట్ రవికుమార్‌రెడ్డి, అకాడమిక్ సలహాదారులు రూపెన్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రోడ్లపై కల్లాలతో పొంచి ఉన్న ప్రమాదం

నారాయణఖేడ్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై పంట నూర్పిడి చేయొద్దని అధికారులు అవగాహన కల్పిస్తున్నా కొందరు రైతుల్లో మార్పురావడం లేదు. నారాయణఖేడ్ మండల సమీపంలోని కంగ్టి రోడ్డుపై పంట నూర్పిడి కోసం కంది కర్రలతో పాటు చిన్నచిన్న కుప్పలను వేశారు. ఈ రోడ్డుపై వాహనాలు నడపాలంటే భయం వేస్తుందని వాహనదారులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి రోడ్లపై పంట నూర్పిడి చేయకుండా అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.


కంగ్టి రోడ్డుపై పంట నూర్పిడి కోసం వేసిన కంది కర్ర

కుంగ్‌ఫూలో విద్యార్థినులకు గోల్డ్‌మెడల్

జోగిపేట, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాలెల్మ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారు. 9వ తరగతి చదువుతున్న బీ.శ్రుతి, సీహెచ్.హమ్రిత్, ఎన్.సుప్రియ జాతీయస్థాయిలో నిర్వహించిన ఓపెన్ కుంగ్‌ఫూ కరాటే చాంపియన్‌షిప్-2025 పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయుడు రమేష్ తెలిపారు. వారిని హెచ్ఎం రమేష్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు.

క్రైం కార్నర్

పేగు రంధ్రానికి శస్త్ర చికిత్స కోసం వెళ్తే.. గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

కొండాపూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శరీరంలో పేగుకు రంధ్రం ఏర్పడడంతో శస్త్రచికిత్సకు వెళ్లి గుండెపోటు వచ్చి ఉపాధి కూలీ మృతిచెందాడు. కొండాపూర్ మండలం గిర్మాపూర్ గ్రామానికి చెందిన సోల్కంపల్లి నవీన్(37) ఉపాధిహామీ పనిలో సీనియర్ మేట్‌గా పనిచేస్తు ఉండేవారు. కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం పరీక్షలు నిర్వహించగా, పేగుకు రంధ్రం ఏర్పడిందని, శస్త్రచికిత్స చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 28న శస్త్రచికిత్స నిమిత్తం నవీన్ ఆసుపత్రిలో చేరాడు. శుక్రవారం శస్త్రచికిత్స చేస్తున్న సమయంలో గుండెపోటు వచ్చి మరణించినట్లు వైద్యులు కుటుంబసభ్యులకు వెల్లడించారు.


నవీన్(ఫైల్)

మంగాపూర్ బస్టాప్ వద్ద రోడ్డు ప్రమాదం

- గంటపాటు ట్రాఫిక్‌జామ్

హత్నూర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని మంగాపూర్ బస్టాప్ వద్ద ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాలీ ఆటో మంగాపూర్ గ్రామం నుంచి నర్సాపూర్ వెళ్తుండగా ఆ గ్రామ బస్టాప్ వద్ద మలుపుతుండగా, దౌల్తాబాద్ వైపు నుంచి నర్సాపూర్ వెళ్తున్న బ్యాంకర్ ఒక్కసారిగా బలంగా ఢీకొట్టింది. ఆటో రోడ్డుపై పల్టీ పడగా, నర్సాపూర్ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జు కాగా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఒక్కసారిగా సంగారెడ్డి-నర్సాపూర్ రోడ్డుపై భయానక వాతావరణం నెలకొంది. రాకపోకలు స్తంభించి సుమారు గంటపాటు ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

మంజీరానగర్‌లో చోరీ

- 7 తులాల బంగారం, 20 తులాల వెండి అపహరణ

సంగారెడ్డి క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లి వేడుకకు వెళ్లిన ఇంటిని రాత్రికిరాత్రే దొంగలు గుల్ల చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని మంజీరానగర్‌కు చెందిన వ్యాపారి కేహనుమంత్ సంగారెడ్డిలోని జలాల్‌బాగ్‌లో నివాసం ఉంటున్నారు. తన సోదరుడి ఇంట్లో పెళ్లి ఉండగా హల్దీ కార్యక్రమానికి కుటుంబీకులతో శుక్రవారం రాత్రి 8 గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. శనివారం ఉదయం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న బీరువాలో ఉంచిన ఏడు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, రూ.40వేల నగదును దొంగలు దోచుకెళ్లారు. బాధితుడు హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ రమేష్ తెలిపారు.

మూడు ఎల్‌ఈడీ టీవీలు చోరీ

రామాయంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట బైపాస్‌లో నిలిపి ఉంచిన డీసీఎం నుంచి మూడు ఎల్‌ఈడీ టీవీలు చోరీకి గురయ్యాయి. మేడ్చల్ నుంచి నిజామాబాద్‌కు ఎల్‌ఈడీ టీవీలతో డీసీఎం వెళ్తుంది. అయితే డ్రైవర్‌కు నిద్రరావడంతో వాహనాన్ని పక్కకు నిలిపాడు. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు శనివారం తెల్లవారుజామున డీసీఎం డోర్ తెరిచి టీవీలను ఎత్తుకెళ్లారు. వాహన యజమాని నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రామాయంపేట బార్‌లో..

రామాయంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట పట్టణంలోని బార్‌లో చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు షట్టర్ తాళాలు పగులగొట్టి రూ.25 వేల విలువైన వస్తువులను దొంగిలించారు. నగదుతో పాటు మందు బాటిళ్లను ఎత్తుకెళ్లినట్టు జరిగింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.